క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, కాలనీవాసులకు ఈ నెల 30వ తేదీన ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు రాజేంద్రనగర్ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బి.కృష్ణారెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొని సమస్యలు, సలహాలు, సూచనలు, మరిన్ని సేవలు తదితర వాటిపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

మహిళా కాంగ్రెస్ శాఖను మరింత పటిష్ట పర్చాలి



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మంగళవారం ఉదయం రాజేంద్రనగర్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ బి–బ్లాక్ అధ్యక్షురాలు పలుగుచెరువు మౌనిక నరేందర్, నియోజకవర్గం కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పుట్ట రమాదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. బి–బ్లాక్ అధ్యక్షురాలిగా ఎన్నికైన అనంతరం మౌనిక ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మహిళా కాంగ్రెస్‌ను మరింత పటిష్ట పరచాలని ఎమ్మెల్యే సూచించినట్లు ఆమె తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని కాంగ్రెస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.ధనుంజయ సూచించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సహకారంతో లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో డ్రైనేజీ నాలా నిర్మాణ పనులు మంజూరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.ప్రేమ్‌గౌడ్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అనిల్, ఖలీల్‌హాయ్, రఘుపతి, వీరేష్, శివ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శాలినికి నివాళులర్పించిన మాజీ చైర్మన్

మణికొండ: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన శాలిని మృతదేహానికి మంగళవారం రాత్రి మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ నివాళులర్పించారు. మంగళవారం ఉదయం పైప్‌లైన్ రోడ్డులోని సుందర్ గార్డన్ ముందు స్కూటీపై వస్తున్న ఆమెను వెనుక నుంచి జలమండలి నీటి ట్యాంకర్ ఢీకొట్టడంతో మృతి చెందింది. ఆమె ప్రమాద స్థలంలోనే మృతి చెందినా రాయదుర్గం పోలీసులు ముందుగా కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రాత్రి 8గంటల సమయంలో మృతదేహాన్ని పుప్పాలగూడ బీఆర్‌సీ అపార్ట్‌మెంట్‌లోని ఆమె నివాసానికి తెచ్చారు. అరగంట పాటు ఇంట్లో ఉంచి తిరిగి వారి స్వస్థలం ప్రకాశం జిల్లా కందుకూరుకు తరలించారు. కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ, మాజీ కౌన్సిలర్లు, నాయకులతో పాటు తోటి నివాసితులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.

మనూలో ఎఫ్‌డీపీ ప్రారంభం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూజీసీ–ఎంఎంటీటీసీ స్వావలంబన మహిళా వ్యవస్థాపక కార్యక్రమంలో భాగంగా అయిదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)ని మంగళవారం రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థలలో మహిళల నేతృత్వంలో వ్యవస్థాపకతను పెంపొందించే దిశగా అడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఈఎస్‌బియూడీ) సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ యామిని జైస్వాల్ మాట్లాడారు. ఇతర పైలట్ సంస్థల విజయగాథలను పంచుకున్నారు. ఈ సమావేశంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ, యూజీసీ–ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్‌ఫాతిమా, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మెరాజ్ అహ్మద్, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

- ఇరుకు రోడ్లలో ఉరుకులు, పరుగులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని యంత్రాంగాలు



నాలుగు రోజుల క్రితం శ్రీరాంనగర్ కాలనీలో స్కూటీని ఢీ కొట్టిన ఆటో



మహిళ మృతికి కారణమైన నీటి ట్యాంకర్

మణికొండ: అసలే ఇరుకు రోడ్లు.. ప్రతి చౌరస్తాలో ట్రాఫిక్ జామ్స్.. వాటిని దాటగానే తమ వెంట ఎవరో పడుతున్నట్టుగా వేగంగా ప్రయాణాలు.. చుట్టుపక్కల ఎవరు, ఎలా వెళ్తున్నారనే విషయాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి కొందరు డ్రైవర్లు నిండు ప్రాణాలను తీస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కువ శాతం కాలనీల్లో ఇరుకు రోడ్లే ఉంటాయి. ప్రధాన రోడ్లు కాస్త వెడల్పుగా ఉన్నా వేలాది వాహనాలతో రద్దీగా మారుతున్నాయి. ఎక్కడైనా ఖాళీ రోడ్డు కనిపిస్తే చాలు వాహనాలను వేగంగా నడిపిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం శ్రీరాంనగర్ కాలనీలో ఓ వ్యక్తి ఇద్దరు పిల్లలను స్కూల్‌కు పంపేందుకు స్కూటీపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చి ఆటో నిర్లక్ష్యంగా వారిని ఢీ కొట్టడంతో వారు రోడ్డుపై పడి గాయాలపాలయ్యారు. హుడా కాలనీలో రోడ్డు పక్కన ఆడుకుంటున్న ఓ బాలికను సోమవారం నీటి ట్యాంకర్ ఢీ కొట్టినంత పనిచేసింది. తృటిలో బాలిక ప్రాణాలతో బయటపడింది. వాటిని మరవక ముందే మంగళవారం తమ పిల్లల స్కూల్ బస్సు మిస్ కావడంతో అది వెళ్తున్న దారిలో దాన్ని చేరుకుని పిల్లలను ఎక్కించి వస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శాలిని(36) స్కూటీని నీటి ట్యాంకర్ వెనుక నుంచి తగలడంతో రోడ్డు పక్కనే ఉన్న ప్రకటనల పోల్‌కు ఢీకొట్టి రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

డ్రైవర్లను కట్టడి చేయాలి..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని కాకుండా ఇష్టారాజ్యంగా నీటి ట్యాంకర్లు, కొన్ని స్కూల్స్ బస్సులు, డెలివరీ బాయ్స్, ఆటోవాలాలు తమ వాహనాలను నడుపుతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శాలిని మృతితో స్థానికంగా అనేక మంది ఇష్టారాజ్యంగా వాహనాలను నడిపే వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, చిన్న వయసు వారు సైతం వాహనాలను నడుపుతున్నారని వారు తెలిపారు. అధికారులు అలాంటి వారిని గుర్తించి ర్యాష్ డ్రైవింగ్‌లను కట్టడి చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.



ఘటనా స్థలంలో రోడ్డును కాకుండా దిక్కులు చూస్తున్న సీసీ కెమెరాలు

రికార్డుల్లోనే మాస్టర్ ప్లాన్స్..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న రోడ్లను వెడల్పు చేయటంతో పాటు కొత్త రోడ్లను ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలం క్రితం మాస్టర్ ప్లాన్‌లలో నమోదు చేశారు. వాటిని ఆచరణలోకి తీసుకు రాకపోవడంతో నిత్యం తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షేక్‌పేట నుంచి అవుటర్‌రింగ్ రోడ్డు వరకు వంద అడుగుల వెడల్పుతో మాస్టర్ ప్లాన్‌లో రోడ్డు ఉన్నా దాన్ని ఆచరణలోకి తెచ్చేందుకు ప్రభుత్వాలు కృషి చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక చోట్ల లింక్ రోడ్లను ప్రతిపాదించి మిన్నకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా రోడ్లపై వాహనాల ప్రయాణాన్ని గమనించటంతో పాటు ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు కారణాలను తెలుసుకునేందుకు రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోవడం లేదని మున్సిపాలిటీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రానివ్వొద్దు

- సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్



అలకాపూర్ టౌన్‌షిప్‌లో విద్యుత్ సమస్యలు తెలుసుకున్న ఎస్ఈ చంద్రశేఖర్

మణికొండ: విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా నిరంతరం సరఫరా అయ్యేలా చర్యలను చేపట్టాలని సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అలకాపూర్ టౌన్‌షిప్, డాలర్స్‌హిల్స్, పుప్పాలగూడ, మణికొండ, ఫ్రెండ్స్ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీలలో మంగళవారం ఆయన పర్యటించి ప్రజలను అడిగి విద్యుత్ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనేక కాలనీలలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, విద్యుత్ వైర్లు తెగిపోవడం, చెట్ల కొమ్మలు తగలడంతో సరఫరా నిలిచిపోతోందని పలువురు తెలిపారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా గృహోపకరణాలు కాలిపోతున్నాయని వివరించారు. అనంతరం విద్యుత్ అధికారులతో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేలా ప్రతి ఫీడర్ పరిధిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ఆటో రిక్లోజర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అలాంటివి 60 వరకు మంజూరు చేస్తానన్నారు. రాబోయే ఏడాది కాలంలో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలకు అండర్‌గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను సరఫరా చేస్తామని, అప్పుడు సరఫరా ఆటంకం లేకుండా కొనసాగుతుందన్నారు. అదనపు సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల అవసరాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఇబ్రహింబాగ్ డివిజన్ పరిధిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా పెరుగుతోందని, అందుకు అనుగుణంగా తమ సంస్థ తరఫున ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఇబ్రహింబాగ్ డీఈ రమేష్‌చంద్ర, ఏడీఈ అంబేడ్కర్, మణికొండ ఏఈ సంతోష్‌కుమార్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీతో పాటు పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

ఎస్టీపీ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీల వాసులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలోని పలు కాలనీల మధ్య మురుగు నీటి శుద్ధి కేంద్రం(ఎస్‌టీపీ) నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు. విష్ణుేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ, కేకే–2 నగర్, దత్తాత్రేయ కాలనీ, రంగారెడ్డి కాలనీతో పాటు మరో ఐదు కాలనీల వాసులు మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నివాస ప్రాంతాల మధ్య శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల వాతావరణం కాలుష్యం, శబ్ద కాలుష్యం, దుర్వాసనతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారికి ఇది ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఈ నిర్మాణ పనులను నిలిపేలా చొరవ చూపాలని ఎమ్మెల్యేను కలిసి విన్నవించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జీఎస్టీ చెల్లించని వాటికి పెనాల్టీ



తనిఖీలు చేపడుతున్న రమేష్‌నాయక్ తదితరులు

అత్తాపూర్: జీఎస్టీ చెల్లించకుండానే ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రమేష్‌నాయక్ హెచ్చరించారు. జీఎస్టీ బృందం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ పీవీ నర్సింహరావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే 120 పిల్లర్ వద్ద మంగళవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వివిధ ప్రాంతాలకు సరుకు రవాణా చేసే ట్రక్కులు, లారీలు ఇతర వాహనాల యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో చెల్లించాల్సిన ట్యాక్స్‌లను చెల్లించకుండానే సరుకు రవాణా చేస్తున్నట్లు చెప్పారు. వాహన తనిఖీల్లో భాగంగా జీఎస్టీ చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి పెనాల్టీ విధించారు.

దేశానికి ఆర్థిక శక్తిగా నిలుస్తాం



క్రెడాయ్ బాధ్యతలు తీసుకున్న నూతన కమిటీ

మణికొండ: మన దేశ ఆర్థిక వ్యవస్థ 2047 సంవత్సరానికి 50 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే దిశగా అడుగులు వేస్తోందని, దానికి ఐదు ట్రిలియన్ డాలర్లను తమ నిర్మాణ రంగ పరిశ్రమ ద్వారా అందిస్తామని కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) చైర్మన్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అధ్యక్షుడు కె.ఇంద్రసేనారెడ్డి అన్నారు. 2025–2027సంవత్సరాలకు నూతన మేనేజ్‌మెంట్ కమిటీని మంగళవారం రాత్రి ప్రకటించారు. గండిపేటలోని సవాయ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ హైదరాబాద్ నగరం రీజనల్ రింగ్ రోడ్డు, న్యూ సిటీ వంటి పథకాలతో అభివృద్ధి దిశగా పయనిస్తోందని, అందులో తాము భాగస్వాములం అవుతామన్నారు. భవిష్యత్తుకు అనుకూలంగా అధునాతన మౌళిక సదుపాయాలు, సాంకేతికతో నివాసాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది మన రాష్ట్రం, దేశానికి వృద్ధి సమయమని అందులో భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఓ ప్రాజెక్ట్ ఆమోదం, భూ సేకరణకు 4నుంచి 5 సంవత్సరాలు పడుతుందని, దాన్ని గణనీయంగా తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రియల్ ఎస్టేట్ రంగం సవాళ్లను అర్థం చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. బిల్డ్‌నౌ, అప్రూవ్ లెటర్ మోడల్‌లు తమకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. నగరంతో పాటు టైర్ 2, 3 నగరాల్లోనూ రాబోయే రోజుల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎలెక్ట్ ప్రెసిడెంట్ ఎస్.రాంరెడ్డి, కార్యదర్శి జి.అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీకాంత్, గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, సత్యానారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీ నాగప్రసాద్, కోశాధికారి జగన్‌మోహన్ పాల్గొన్నారు.

జేఎన్‌వీ ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆగస్టు 13 ఆఖరు..
డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష


రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలో 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష గడువు తేదీని పెంచారు. ఇంగ్లిష్ మీడియంలో రెసిడెన్షియల్ పద్ధతిలో కో ఎడ్యుకేషన్ 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకోవడానికి అవకాశం కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష మెంటల్ అబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్ సబ్జెక్టులపై ఉంటుంది. ప్రస్తుతం అయిదవ తరగతి చదివే వారు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.

డ్రైనేజీ సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం



మోహన్‌రెడ్డినగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న జలమండలి అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని జలమండలి సీజీఎం నారాయణ అన్నారు. డివిజన్ పరిధిలోని మోహన్‌రెడ్డినగర్‌లో జలమండలి అధికారులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. డ్రైనేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని కాలనీల వాసులు జలమండలి అధికారులకు వివరించారు. స్పందించిన అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికులను అడిగి సమస్యల గురించి తెలుసుకున్నారు. త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీఎం సాయిలక్ష్మీ, డీజీఎం వి.రేణుక, మేనేజర్ అబ్దుల్ ఖాదర్, సూపర్‌వైజర్ లోక్‌నాథ్, బీఆర్ఎస్ నాయకులు జంపుల భగవాన్‌దాస్, రాజు, మోసిన్, ఆకాష్, రాఘువేందర్ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అధ్యక్షతన 17వ డివిజన్‌లోని మిడ్‌సిటీ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రవాణాశాఖలో పెంచిన సర్వీస్ చార్జీలను తగ్గించాలి



మాట్లాడుతున్న జాజాల రుద్రకుమార్

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 రవాణా చట్టాన్ని రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని, ఇది సరైంది కాదని ఏఐటీయూసీ ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు వేర్వేరు కావని రెండు ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల చట్టాలను చేస్తూ కార్మికులు, డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. అదే పద్ధతిలో రాష్ట్రంలో రవాణా శాఖలో సర్వీస్ చార్జీలు పెంచడం వాహనదారులు, డ్రైవర్లకు చాలా నష్టం అని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ రూ.12 వేలను ఆటో డ్రైవర్లకు ఇవ్వడం లేదని, కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కొత్త చట్టాలను అమలు చేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. భవిష్యత్తులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు

- కరెంటు సరఫరాకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న రైతులు



మల్కారంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతు

శంషాబాద్ రూరల్: రైతుల పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్కారంలోని వ్యవసాయ పొలాలకు కరెంటు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ ఐదు రోజుల క్రితం కాలిపోయింది. దీని స్థానంలో ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని గంటలలోపే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ లీకేజీ కావడంతో పాటు కాలిపోయింది. దీంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది.

సాగు కోసం రైతుల అవస్థలు..

ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు వరిసాగు పనులు చేపట్టారు. ఇదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ మొరాయిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజుల నుంచి కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో బోర్లు పని చేయగా.. సాగు పనులు ముందుకు సాగడం లేదు. ఈసీవాగు పరిసరాల్లోని భూముల్లో రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో కరెంటు సరఫరాకు అంతరాయం కలిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాహనాలు సాఫీగా సాగేలా..

- ఆరాంఘర్ చౌరస్తాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం అధికారుల పరిశీలన



ఆరాంఘర్ చౌరస్తాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పరిశీలిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: ఆరాంఘర్ చౌరస్తాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ట్రాఫిక్ డీసీపీ సాయిమనోహర్ వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజు, విద్యుత్ విభాగం ఏఈ, జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, ఆర్టీసీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఉన్నారు. ప్రధానంగా ఫ్రీ లెఫ్ట్‌తో పాటు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న నిర్మాణాలను పరిశీలించారు. ఆరాంఘర్ చౌరస్తాలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు కోసం చర్చించారు. అలాగే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు, రోడ్లపై ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపుపై చర్చించారు. బృందావన్ హోటల్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధికారుల బృందం పర్యటన అనంతరం మరోసారి పర్యటించి సమస్యను పూర్తిగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

సేవలే ఎప్పటికీ గుర్తుండిపోతాయి

- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రభుత్వ అధికారులకు బదిలీలు, ఉద్యోగ విరమణ తప్పవని, వారు చేసిన పనితీరు, సేవలు ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండి పోతాయని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గండిపేట మండల విద్యాధికారి, నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.విజయ్‌కుమార్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన వీడ్కోలు సమావేశం నార్సింగిలోని కేవీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నార్సింగి ఉన్నత పాఠశాల రూపురేఖలను మార్చిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. అదనపు తరగతి గదులు, గ్రంథాలయం, విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ సీట్లు వచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డు దక్కించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఇలాంటి ప్రదానోపాధ్యాయులు ఉంటే పాఠశాలల రూపురేఖలు మారడంతో పాటు విద్యార్థులు ఎలాంటి సమస్యలు లేకుండా ఉన్నతంగా చదువుకుంటారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్: కడుపు నొప్పి కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పెద్దషాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుక్కల విజయ్‌కుమార్(26) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో 28న ఇంట్లో పైకప్పునకు టవల్‌తో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కిందకు దించారు. 108కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో మంగళవారం మేధో సంపత్తి హక్కులపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ, పేటెంట్ దాఖలాకు సంబంధించిన ప్రక్రియలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు ఉదయ్‌కుమార్, హరికృష్ణ, డాక్టర్ మాధురి, డాక్టర్ కల్పన శాస్త్రి, రిజిస్ట్రార్ శరత్ చంద్ర, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.